TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 169 | శనివారం 13-06-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

# ఆ కారణంతోనే పవన్ సభకు అనుమతివ్వలేదు:



- పవన్ సభకు అనుమతి నిరాకరణ.
- కారణం శాంతిభద్రతలేనన్న సీఎం.
- పవన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు.
- భాజపాపై రేవంత్ విమర్శలు.
- కిషన్‌రెడ్డిపై ఆరోపణలు.
- హిట్లర్ వ్యాఖ్యలను ఖండించిన సీఎం.

దిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా (దీబ్రీ) కార్యకర్తలా వ్యవహరించారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. దిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో రేవంత్ మాట్లాడారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై ఆయన విమర్శలు చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సభకు హైదరాబాద్‌లో అనుమతి నిరాకరించిన అంశంపైనా సీఎం స్పందించారు.

### కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా

"మధ్యప్రదేశ్‌లో భాజపాకు సరిపడా సంఖ్యా బలం లేకపోయినా.. రాజ్యసభ స్థానానికి మూడో అభ్యర్థిని పోటీకి పెట్టారు. ఇప్పటి వరకు భాజపా ఓటు చోరీ మాత్రమే చేసింది.. ఇప్పుడు సీట్ చోరీ కూడా మొదలుపెట్టింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలి. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 4 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, 2లో..

## అమెరికా దౌత్యవేత్తకు మరోసారి భారత్ సమన్లు



2లో

## ఎయిరిండియా విమాన దుర్ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది:



- ఎయిరిండియా ప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతోంది.
- నిష్పక్షపాతంగా విచారణ జరుగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు.
- AAIBకీలక ఆధారాలను పరిశీలిస్తోంది.
- తుది నివేదిక త్వరలో విడుదల కానుంది.
- ప్రమాదంలో మొత్తం 260 మంది మృతి చెందారు.
- ఒక్క ప్రయాణికుడు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. తప్పుడు ప్రచారాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

2లో

## వచ్చే ఏడాది మార్చి వరకు బీబీనగర్ ఎయిమ్స్ అందుబాటులోకి

అమీర్‌పేట: బీబీనగర్‌లో నిర్మిస్తున్న ఎయిమ్స్ ఆసుపత్రిని వచ్చే ఏడాది ఫిబ్రవరి– మార్చి నాటికి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. సనత్‌నగర్‌లోని ఈఎస్‌ఐసీ ఆసుపత్రిని కూడా మరో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేయనున్నామన్నారు. అమీర్‌పేట, సనత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను శుక్రవారం కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమీర్‌పేట యూపీహెచ్‌సీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

పేజి 2లో ▶



## ప్రజలు అధికారంతో పాటు .. అతి పెద్ద బాధ్యత అప్పగించారు



ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు.. రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశను చూపిన చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ప్రజలు రెండేళ్ల క్రితం కేవలం అధికారాన్ని మాత్రమే కాకుండా బాధ్యతను కూడా అప్పగించారని చెప్పారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. గ్రామమే దేశ అభివృద్ధికి కేంద్ర బిందువని పేర్కొన్న పవన్.. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు గ్రామ పంచాయతీల స్థాయిలోనే జరగాలని అన్నారు. గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల, జిల్లా లేదా ఎమ్మెల్యే స్థాయికి వెళ్లకుండా స్థానికంగానే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు.

పేజి 2లో ▶

- ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ
- గ్రామాల అభివృద్ధితోనే దేశం బలపడుతుంది
- సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావడం మేలు
- సమిష్టి కృషితోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం
- యువత ఆశయాలు, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి
- రెండేళ్ల విజయోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

## మంత్రాలయంలో వైకాపా మూకల కవ్వింపు చర్యలు



కౌతాళం: కర్నూలు జిల్లా మంత్రాలయంలో వైకాపా మూకలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డాయి. మాధవరంలోని మంత్రాలయం తెదేపా ఇన్‌ఛార్జ్ రాఘవేంద్రరెడ్డి క్యాంప్ కార్యాలయం ముందు వైకాపా కార్యకర్తలు బాణసంచా కాల్చుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొందరు తొడలు కొడుతూ అత్యుత్సాహం ప్రదర్శించారు. వైకాపా మూకలను తెదేపా నేతలు, కార్యకర్తలు అడ్డుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో రెండు వాహనాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు.

పేజి 2లో ▶

## రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు

కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ నమ్మకం, సంక్షేమంపై తిరుపతి దామినీడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాయలసీమ అంటే ఎన్టీఆర్‌కు చాలా ప్రేమ అని తెలిపారు. నాడు కరువు వస్తే జోలె పట్టుకుని సీమ ప్రజలను ఆదుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. రాయలసీమను రాయల్‌సీమగా మార్చామని మంత్రి చెప్పారు. రాయలసీమలో రత్నాలు పండేలా చేసిన వ్యక్తి సీబీఎన్ అని కొనియాడారు. గొడ్డలి పార్టీ అరాచక పాలన చూశామన్నారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు.

పేజి 2లో ▶

- రెడ్‌బుక్ తనపని తను చేసుకుంటూ పోతుంది
- రాయలసీమను రాయల్ సీమగా మార్చాం
- మనది గూగుల్ అయితే..వారిది గొడ్డలి
- తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు



## ఎవరితోనూ పొత్తులుండవ్.. పోటీ భాజపాతోనే: కేటీఆర్



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి తో తనకు వ్యక్తిగత పంచాయితీ లేదని.. ప్రభుత్వాన్ని నడుపుతున్న విధానం తనతో సహా చాలా మందికి నచ్చడంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (ఖు=) అన్నారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలో ఉందని.. హైదరాబాద్‌లో వర్షం పడి ప్రజలకు ఇబ్బంది ఎదురైతే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. గతంలో 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. నగరాన్ని అద్దంలా మాకు అప్పగిస్తే.. మేం చెడగొట్టామా? అని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడారు.

# సంపాదకీయం

## విధ్వంసం.. విశేషాలు.. వెలుగులు!

యుద్ధ విధ్వంసాలూ దారుణాలూ లెక్కలేనన్ని బాధలనూ కలగచేస్తాయనే సంగతి అందరికీ తెలిసిందే. అందులో ప్రత్యేకత ఏమీలేదు. ప్రతి యుద్ధంలోనూ అవే పునరావృతం అవుతాయి. వాటిల్లో సమిధలు అయ్యేదీ సాధారణ ప్రజలే. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సాగిస్తోన్న దాడులకూ దురాగతాలకూ హెజ్బుల్లా తీవ్రవాదులే మరణించటం లేదు. సాధారణ ప్రజలే ఎక్కువగా బలవుతున్నారు. అమెరికా--ఇజ్రాయెల్‌లు 40 రోజుల పాటు ఇరాన్‌పై చేసిన యుద్ధంలో ఎంతమంది చనిపోయారో అంతకుమించి లెబనాన్ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కటువుగా హెచ్చరికలు చేసినా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను ఆపటం లేదు. ఏదో ఒక మిషతో వాటిని కొనసాగిస్తూనే ఉంది. ఇక లెబనాన్‌లో దాడులనూ విధ్వంసాలనూ ఆపితేనే శాంతిప్రక్రియ కొలిక్కివస్తుందని అమెరికాకు ఇరాన్ తేల్చిచెబుతోంది. పశ్చిమాసియాలో శాంతి ఏర్పడి హోర్ముజ్ దిగ్బంధం తొలగిపోవాలంటే లెబనాన్‌లో పరిస్థితి కుదుటపడాలి. అదంత తేలికగా జరుగుతుందని చెప్పలేం. 1975 నుంచి ఇప్పటివరకూ ఏదో విధంగా సంక్షోభాన్ని లెబనాన్ ఎదుర్కొంటూనే ఉంది.లెబనాన్ చాలా చిన్నదేశం. చమురు వనరులు పెద్దగా లేవు. ఆ దేశ ఉత్తరాది సరిహద్దు నుంచి దక్షిణాదికి మధ్య దూరం 217 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఇక తూర్పు, పశ్చిమాల మధ్య దూరం మరీ తక్కువ. 32 నుంచి 88 కిలోమీటర్ల మధ్యే ఉంటుంది. మొత్తంగా దేశ విస్తీర్ణమే 10,452 చదరపు కిలోమీటర్లు మాత్రమే. అంటే హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలెప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధికి సమానంగా లెబనాన్ విస్తీర్ణం ఉంటుంది. జనాభా 58 నుంచి 60 లక్షల లోపుగానే ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. అంచనాలేనని ఎందుకు అనుకోవాల్సి వస్తుందంటే 1932 నుంచి ఇప్పటివరకూ అక్కడ జనాభాను అధికారికంగా గణించలేదు. 1932 నాటి లెక్కల ప్రకారమే ఇప్పటికీ అక్కడ చాలావరకూ పదవులూ ఉద్యోగాల పంపకాలూ ఆధారపడి ఉన్నాయి. ఇంకో విచిత్రం కూడా లెబనాన్‌లో ఉంది. మొత్తం జనాభాలో దాదాపు 15 నుంచి 20 లక్షల మంది సిరియా, పాలస్తీనా నుంచి వచ్చిన శరణార్థులే ఉన్నారు. అంటే జనాభాలోని ప్రతి నలుగురిలో ఒకరు శరణార్థే అన్నమాట. ఈ పరిస్థితి ప్రపంచంలో మరే దేశంలోనూ లేదు.

లెబనాన్ అంటే హెజ్బుల్లాలు, ఇజ్రాయెల్‌పై వాళ్లు ప్రయోగించే రాకెట్లు మాత్రమే కాదు. అంతకు మించిన ఘనచరిత్రా లెబనాన్‌కు ఉంది. తొలి లిపి అక్కడే రూపుదిద్దుకున్నదని చెప్పే చరిత్రా మనకు ఎదురవుతుంది. యూరప్‌కూ ఆసియాకూ మధ్య శతాబ్దాలపాటు వారధిగా నిలిచింది. లెబనాన్‌లో అడుగుపెట్టని మహాసామ్రాజ్యం లేదు. మతహింస బాధితులందరికీ ఒకనాడు లెబనాన్ ఆశ్రయమిచ్చి అక్కున చేర్చుకొనేది. అందుకే ఈనాటి విధ్వంసాలు, ప్రతివిధ్వంసాలను దాటుకుని కాస్త వెనుకకు వెళ్లి చరిత్రను చూస్తే ఎన్నో విశేషాలూ, వెలుగులూ కనపడతాయి. కులాల జనాభా ప్రాతిపదిక మీద ఉద్యోగాలూ, పదవులూ ఇవ్వాలనే డిమాండు భారత్‌లో ఊపందుకుంటున్న వేళ లెబనాన్ ఎంతో ముందుగా ఆ తరహా పద్ధతిని మతప్రాతిపదికన ప్రవేశపెట్టి సాధించిన విజయాలనూ, తెచ్చిపెట్టుకున్న ఘోర సమస్యలనూ పరిశీలిస్తే ఇక్కడి సామాజిక సమస్యలపై ఎలాంటి వైఖరి అనుసరించాలో కొంతైనా తెలుస్తుంది.

పశ్చిమాసియాలో ఒకప్పుడు (1950, 1960ల్లో) లెబనాన్ చాలా వాటిల్లో ముందుండేది. బహుళపార్టీ రాజకీయ వ్యవస్థతో పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ తర్వాత ప్రజాస్వామ్యాన్ని కలిగిన దేశంగా గుర్తింపు ఉండేది.

## ఆ కారణంతోనే పవన్ సభకు అనుమతివ్వలేదు: సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)ను కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారు.

### హిట్లర్ ఆదర్శమని ఎప్పుడూ చెప్పలేదు

తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలి. ప్రధాని మోదీనే నన్ను కౌగిలించుకున్నారు.. నేను కాదు. హిట్లర్ నాకు ఆదర్శమని నేనెప్పుడూ చెప్పలేదు. ప్రజాస్వామ్యంలో ఉన్నవాళ్లు ఎవరైనా హిట్లర్ ఆదర్శమని అంటారా?మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం వద్ద చర్చ జరగలేదు" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## ఎవరితోనూ పొత్తులుండవ్.. పోటీ భాజపాతోనే: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

**నీరు నిలిస్తే బాధ్యత మాదా?**

“బీఆర్ఎస్ హయాంలో వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ) చేపట్టి మెరుగు చేస్తే.. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేశారు. నీళు నిలవకపోతే క్రెడిట్ తీసుకుంటారు.. నిలిస్తే బీఆర్ఎస్‌ది బాధ్యత అంటారా? ఉన్న నగరంపై సీఎంకు అవగాహన లేదు కానీ.. ఫ్యూచర్ సిటీ అని ప్రగల్భాలు పలుకుతున్నారు. రేవంత్ సీఎం కాగానే ఎయిర్‌పోర్టుకు మెట్రోను రద్దు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండి ఉంటే ఈ పాటికే పూర్తయ్యేది. ఆ మెట్రో లైన్ పూర్తయి ఉంటే సమస్య ఇంత ఉండేది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయింది. ఎల్ అండ్ టీ నుంచి మెట్రోను లాక్కోవడం తప్ప చేసిందేంటి? హైడ్రానే అన్నీ చేస్తోందని చెప్పి అధికారాలు ఇచ్చి బ్లాక్‌మెయిలింగ్ వ్యవస్థలా చేశారు.

**జారుడుబండపై కాంగ్రెస్..**

కేసీఆర్ బస్సు యాత్ర ఉంటుంది.. ఎప్పుడనేది తర్వాత తెలుస్తుంది. ూ×=, సభ్యత్వ నమోదుపై దాదాపు 60 నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తయ్యాయి. 15 రోజుల్లో అవి పూర్తవుతాయి. త్వరలో అన్ని నియోజకవర్గాల వారీగా శిక్షణ ఉంటుంది. వచ్చే నెలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతాం. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మూడో స్థానంలో ఉంటుంది. బీఆర్ఎస్‌కు భాజపాతోనే పోటీ. తెలంగాణ వచ్చిన తర్వాత ఎవరితోనూ పొత్తులు పెట్టుకోలేదు.. భవిష్యత్‌లోనూ ఉండవు. కాంగ్రెస్, భాజపాకు అంత రీచ్, క్యాడర్ లేదు. బీఆర్ఎస్‌కు బలమైన నాయకత్వం, క్యాడర్ ఉంది. కాంగ్రెస్ జారుడుబండపై ఉంది.. కిందికే తప్ప పైకి వెళ్లలేరు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరించడం సరికాదు. ఈ వ్యవహారంలో తెలంగాణ కాంగ్రెస్ నుంచే సమాచారం వచ్చిందని మహారాష్ట్ర మంత్రి చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్‌లో బ్లాక్ షీప్ ఎవరో రాహుల్ గాంధీ తేల్చాలి”అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**డీలిమిటేషన్‌లో దక్షిణాది వాటా తగ్గితే ఊరుకోం**

వచ్చే నెలలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందనే సమాచారం తమకుందని కేటీఆర్ అన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. “జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో చూడాలి.

# స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. పి4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు. నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు.. రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చాం. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి.. శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతాం. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు బహిర్గతమే. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ భరోసా.. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం అన్నారు. గిట్టుబాటు ధర లేకపోతే రైతులను ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తున్నాం. ఓటమి ఎరుగని నాయకుడు నరేంద్రమోదీ. గుజరాత్, దిల్లీలో మోదీ అనేక కార్యక్రమాలు చేయగలిగారు. 12 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధివైపు దూసుకెళ్లిందని సీఎం అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని గెలిపిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ప్రజలను కోరామని తెలిపారు. 2024లో 57 శాతం ఓట్ షేర్.. 94 శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని చెప్పుకొచ్చారు. 2024లో రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకున్నారని అన్నారు. తన రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలైందన్నారు. రాష్ట్రం, దేశం బాగుండాలని కోరుకునే వ్యక్తి పవన్ అని చంద్రబాబు వెల్లడించారు. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని సీఎం విమర్శించారు. ప్రజా వేదిక కూల్చివేతతో జగన్ అరాచక పాలన మొదలైందని అన్నారు. కేంద్ర పథకాలు, సాగునీటి ప్రాజెక్టులను పక్కన పడేశారని మండిపడ్డారు. అప్పులు, అరాచకాలు, ఆర్థిక విధ్వంసం తప్ప జగన్ చేసిందేమీలేదని విమర్శించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. కేసులు, జైళ్లతో చీకటి పాలన సాగించారని దుయ్యబట్టారు. అలాంటి దశలో నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఏపీలో చీకటి పాలన పోయి.. ప్రజాపాలన వచ్చిందన్నారు. 21వ శతాబ్దం ప్రధాని మోదీదే అని సీఎం స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశానికి మోదీ ఆత్మస్థైర్యం ఇచ్చారన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీ పాలనలో భారత్ ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడించారు. పుట్టపర్తిలో ఐదో తరం ఫైటర్‌జెట్ తయారుకాబోతోందన్నారు. తిరుపతిలో బుల్లెట్ ఫ్యాక్టరీ వస్తోందని, రాయలసీమ ఇప్పుడు బంగారుసీమ కాబోతోందన్నారు. వచ్చే నెలలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. జొన్నవాడలో బంగారం వెలికితీస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ, సోలార్, విండ్ పవర్‌పై దృష్టి సారించినట్లు చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేస్తున్నామని తెలిపారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమ ముఖచిత్రాన్ని కాపాడతామన్నారు. కల్యాణి డ్యామ్‌కు ఈ ఏడాది నీళ్లు తీసుకొస్తున్నామన్నారు. 3 రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. '3 రాజధానులు కాదు.. 3 ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం' ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఈసభలో పాల్గొన్నారు.

## అమెరికా దౌత్యవేత్తకు మరోసారి భారత్ సమన్లు

మొదటిపేజీ తరువాయి

భారత విదేశాంగ శాఖ మరోసారి దిల్లీలోని అమెరికా దౌత్యవేత్త జేసన్ మీక్స్‌కు సమన్లు జారీ చేసింది. ఒమన్ తీరంలో భారతీయులతో వెళ్తున్న నౌకలపై గత నాలుగు రోజుల వ్యవధిలోనే అమెరికా మూడు సార్లు దాడులు చేసింది. గురువారం కూడా ఓ నౌకపై దాడి జరగ్గా 20 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. ఈ దాడుల్ని ఖండించిన భారత్ తాజాగా అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసింది. అంతకుముందు ఓ నౌకపై దాడి ఘటనలో.. ముగ్గురు భారతీయులు గల్లంతైన సమయంలోనూ భారత్ సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే.

పశ్చిమాసియా సముద్ర జలాల్లో వాణిజ్య నౌకాయానానికి పెరుగుతున్న ముప్పుపై విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు, అమెరికా నౌకాదళం దాడి చేయడంతో ఒమన్ తీరంలో బుధవారం గల్లంతైన ముగ్గురు భారతీయ నావికులు మృతిచెందడంతో అక్కడ ఉన్న భారతీయులకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (ఃూ) కీలక సూచనలు చేసింది. హర్మూజ్, ఒమన్ తీరాల్లో పని చేస్తున్న దాదాపు 18వేల మంది నావికులకు సముద్ర భద్రతా సంబంధిత అడ్వైజరీని జారీ చేసింది.

## ఎయిరిండియా విమాన దుర్ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది:

మొదటిపేజీ తరువాయి

అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటన జరిగి నేటికి ఏడాది అయింది. ఈ నేపథ్యంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పందించారు. విమాన ప్రమాదంపై జాతీయ, అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందన్నారు. ప్రమాదంపై త్వరలో తుది నివేదిక వస్తుందని.. దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విమానయాన భద్రతను మరింత మెరుగుపరిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ దుర్ఘటనకు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేయొద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

దర్యాప్తులో గణనీయమైన పురోగతి సాధించాం: ఏఏఐబీ

అంతర్జాతీయ సమీక్షలు, సంప్రదింపు ప్రక్రియలు పూర్తయిన తర్వాత విమాన ప్రమాదంపై తుది నివేదిక విడుదల చేస్తామని ఈ దుర్ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏబీఐ) వెల్లడించింది. ప్రమాదానికి అసలు కారణం తెలుసుకొనేందుకు ఫ్లైట్ రికార్డర్ డేటా, ఇంజిన్ భాగాలు, ఇతర ఆధారాలను విశ్లేషిస్తున్నామని తెలిపింది. ఇప్పటివరకు దర్యాప్తులో గణనీయమైన పురోగతి సాధించామని.. అందులో కనుగొన్న విషయాలను నిర్ధరించుకొనేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొంది.

గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ విషాదానికి గురిచేసిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో విశ్వాస్ కుమార్ అనే వ్యక్తి మాత్రమే ప్రాణాతో బయటపడ్డారు. విమానం హాస్టల్ భవనంపై కూలడంతో మృతుల సంఖ్య 260కి చేరింది. బాధిత కుటుంబాలకు టాటాగ్రూప్ నష్ట పరిహారం చెల్లించింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## వచ్చే ఏడాది మార్చి వరకు బీబీనగర్ ఎయిమ్స్ అందుబాటులోకి

మొదటిపేజీ తరువాయి

నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తరువాత దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు ముఖ్యంగా తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ పేద కుటుంబానికి రూ.5 లక్షల మేరకు ఉచిత వైద్యం అందించేలా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమల్లోకి తెచ్చారన్నారు.సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ, బీబీనగర్‌లోని ఎయిమ్స్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈఎస్ఐసీలో నిర్మించిన కొత్త ఓపీ బ్లాక్‌ను కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. రూ.వెయ్యి కోట్లతో అదనపు భవనాలు, హాస్టల్ వసతులు, మరిన్ని పడకలు ఏర్పాటు చేసి ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సామర్థ్యాన్ని మరింత పెంచుతామన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని యూపీహెచ్‌సీల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించనున్నామని, అవసరమైన వైద్య పరికరాలను కూడా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీనియర్ ప్రజారోగ్య అధికారిణి డా.హేమలత, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ ఎ.సుజాత, దిశా కమిటీ సభ్యులు బూర్గుల శ్యామ్‌సుందర్, భాజపా జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ఉపాధ్యక్షులు వెల్లాల రాంమోహన్, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలు అధికారంతో పాటు .. అతి పెద్ద బాధ్యత అప్పగించారు

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం ప్రతి చిన్న సమస్య కూడా ఎమ్మెల్యేల వద్దకు వెళ్తోందని, రాష్ట్రంలో ఉన్న వందలాది స్థానిక ప్రజాప్రతినిధుల అధికారాలను బలహీనపరిచి, మొత్తం వ్యవస్థను ఎమ్మెల్యేల చుట్టూ కేంద్రీకరించడం సరికాదన్నారు. వ్యవస్థలు బలహీనపడితే కులాలు, ప్రాంతీయ భావాలు బలపడతాయని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమిష్టి ప్రయత్నాలు ఫలించాయని పవన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా తీర్పు ఒక తరం భవిష్యత్‌కు నమ్మకాన్ని ఇచ్చిందని, రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్, ఉపాధి అవకాశాల కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రజలు మౌనంగా ఉన్నా సరైన సమయంలో తమ తీర్పుతో చరిత్రను మార్చగలరని 2024 ఎన్నికలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితమని పవన్ అభిప్రాయపడ్డారు. అధికారం పంచుకోవడం కోసం కాకుండా బాధ్యతను పంచుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగానే గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ కేవలం 21 సీట్లకే పరిమితమైందంటూ విమర్శలు చేశారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ రోజు తాము చేసిన రాజకీయ త్యాగమే కూటమి విజయానికి పునాది అయిందని అన్నారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలంటే కుల, ప్రాంతీయ పరిమితులను దాటి జాతీయ అభివృద్ధి దిశగా ఆలోచించాలని సూచించారు. గ్రామాలకు నిర్ణయాధికారం, బాధ్యతలు పూర్తిస్థాయిలో చేరాయా అనే అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి, జాతీయ పండుగలు నిర్వహించడానికి కూడా నిధులు లేవని అధికారులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిని 'బ్రోకెన్ గవర్నెన్స్'గా అభివర్ణించారు. గ్రామాల్లో రోడ్లు ఎక్కడ వేయాలి? ఎవరికీ ఇళ్లు అవసరం వంటి నిర్ణయాలు కార్యాలయాల్లో కాకుండా ప్రజల మధ్య
గ్రామసభల్లో తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు. గ్రామసభలు బలపడితే సర్పంచ్‌లు బలపడతారని, అప్పుడు ఎమ్మెల్యేలు స్థానిక సమస్యల కంటే యువత భవిష్యత్తు, పరిశ్రమలు, అభివృద్ధి వంటి పెద్ద అంశాలపై దృష్టి సారించగలరని అన్నారు. ప్రజాస్వామ్యానికి గ్రామపంచాయతీలే అతిపెద్ద విశ్వవిద్యాలయాలని పేర్కొన్న ఆయన, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానం కూడా గ్రామస్థాయి నుంచే ప్రారంభమైందని గుర్తు చేశారు. గత రెండేళ్లలో రాజకీయ స్థిరత్వం సాధించడంతో పాటు గ్రామాల వరకు ప్రజాస్వామ్యాన్ని తీసుకెళ్లామని చెప్పారు.

## రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు

మొదటిపేజీ తరువాయి

వైసీపీ అరాచకాలు చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూపోతుందని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్‌జెట్.. వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా.. వాళ్లది కిడ్నాప్. మనది క్రెడిబిలిటీ.. వాళ్లది క్రిమినాలిటీ' అంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో బూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు.

అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జగన్ అంటే జెన్-జీ కాదు, జగన్ అంటే గొడ్డలి' అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు క్రెడిట్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన లోకేష్.. 'రానున్న రోజుల్లో స్వాతంత్ర్యాన్ని కూడా మా తాత తెచ్చాడని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చే ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

---------

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక
శనివారం 13-06-2026

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

**- ఇండ్ల పురోగతిని అధికారులు పరిశీలించాలి**
**- గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం కావాలి**
**- లబ్ధిదారులు సమస్యలు పరిష్కరించాలి**
**- జిల్లాలో 2,834 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి**
**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్, ఎంపీడీఓలు, తహసిల్దార్లు, ఏఈలతో సమావేశం**

రాజన్న సిరిసిల్ల, జూన్ 12 ప్రజా దివాస్
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఏఈలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు.ముందుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై మండలాల వారిగా సమీక్ష చేశారు. జిల్లాలో ఇప్పటిదాకా మొత్తం 7,367 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని వెల్లడించారు. 5,798 ముగ్గు పోశామని, 5,014 ఇండ్లు బేస్మెంట్ లెవెల్లో, 4,362 ఇండ్లు గోడల లెవెల్ లో, 4,012 స్లాబ్ లెవెల్ లో, 2,834 ఇండ్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ముగ్గు పోసిన వారికి ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టించాలని, బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు, అక్కడి నుంచి స్లాబ్ లెవెల్ కు, తుది దశ పనులు పూర్తి చేసేలా.. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ.. పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు.ప్రతి ఎంపీడీఓ ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పరిశీలించాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం కావాలని మండలానికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లి.. ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఇటుకలు ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా.. ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. మేస్త్రీలు, వడ్రంగి ఇతర పని వారి వివరాలు లబ్ధిదారులకు అందుబాటులో పెట్టి ఇబ్బందులు దూరం చేయాలని సూచించారు. లక్ష్యం మేరకు



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పనులు వినియోగించుకునేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని, సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీఓలు ఆదేశించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ఫోటోలు ఎప్పటికప్పుడు హౌసింగ్ ఏఈలు ఆన్లైన్ లో అప్ లోడ్ చేయాలని, లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతి డబ్బు జమ అవుతున్నాయని వెల్లడించారు. ఇండ్ల నిర్మాణాలకు ఎక్కడా ఇసుక కొరత లేదని స్పష్టం చేశారు.సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని గా నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా






**- మనబడి- మన బాధ్యత స్వచ్ఛ పాఠశాల**
**- ప్రభుత్వ పాఠశాలలో టిఫిన్ - బ్రైక్ కార్యక్రమం నిర్వహణ**
**- బండి సంజయ్ ఆదేశాలతో హాజరైన బిజెపి కార్యకర్తలు**

ముస్తాబాద్/జూన్ 12 ప్రజా దివాస్
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో చేపట్టిన "మనబడి -మన బాధ్యత" (స్వచ్ఛ పాఠశాల) కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో "టిఫిన్ బ్రైక్" కార్యక్రమాన్ని బీజేపీ ముస్తాబాద్ మండల అధ్యక్షులు సౌల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకత్వంలో దేశంలో విద్య, పరిశుభ్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత లభిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందించేందుకు భారతీయ జనతా పార్టీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ గత సంవత్సరం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు సుమారు 20 వేల సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. అలాగే పదవ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులను సైతం తన వ్యక్తిగత వేతనం ద్వారా చెల్లించడం వారు విద్యార్థుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు తెలియజేశారు .విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందించేందుకు బండి సంజయ్ కుమార్ ఎల్లప్పుడూ ముందుంటారని అలాగే స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమం ద్వారా పాఠశాలల పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి జిల్లా కార్యదర్శి మీస సంజీవ్ ఆవునూరు గ్రామ సర్పంచ్ నక్క దాసరి రవి పోతుగల్ గ్రామ ఉప సర్పంచ్ కోలా కృష్ణ గౌడ్ బిజెపి మండల ప్రధాన కార్యదర్శిలు శ్రీమతి మల్లీశ్వరి మరియు గోపి బిజెపి సీనియర్ నాయకులు చిగురు వెంకన్న శ్రీనివాసరావు వరి వెంకటేష్ పొన్నం అనిల్ వేణు బాద నరేష్ రాజేష్ మరియు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలు

**- అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల, జూన్ -12 ప్రజా దివాస్
సిరిసిల్ల బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాల లో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు.
తంగళ్ళపల్లి మండలంలోని బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బుస్ర కౌసర్ 1000 మార్కులకు గాను 985 మార్కులు, బైపీసీ విభాగంలో ఎం.నందిని 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించినందుకు ప్రతిభా పురస్కారం ఒక్కరికి రూ.15 వేల చొప్పున ఇద్దరికి మొత్తం రూ.30వేలు జిల్లా కలెక్టర్ .గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అందజేసి.. అభినందించారు.కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్, సంబంధిత పాఠశాలల ఇంచార్జి ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



# రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది..

వీర్నపల్లి మండలం /ప్రజాదివాస్ జూన్ 12



వీర్నపల్లి మండలం వెంకట్రాయిని చెరువులో చేపల వేటకు వెళ్లిన యువకుడు గల్లంతై, 18 గంటల పాటు సాగిన గాలింపు చర్యల అనంతరం మృతదేహం లభ్యమైన . నెల రోజుల క్రితమే వివాహం చేసుకున్న యువకుడి మృతి కుటుంబ సభ్యులను విషాదంలో ముంచెత్తింది.రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలోని వెంకట్రాయిని చెరువులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. బాబాయ్ చెర్వు తండాకు చెందిన ప్రశాంత్ తన బావ సంతోష్‌తో కలిసి చేపల వేట కోసం చెరువులోకి దిగాడు. అయితే కొంతసేపటి తర్వాత ప్రశాంత్ కనిపించకుండా పోవడంతో సంతోష్ స్థానికులకు సమాచారం అందించాడు.సమాచారం అందుకున్న పోలీసులు, స్థానిక యువకులు వెంటనే చెరువులో గాలింపు చర్యలు ప్రారంభించారు. దాదాపు 18 గంటల పాటు కొనసాగిన తీవ్ర అన్వేషణ అనంతరం ప్రశాంత్ మృతదేహాన్ని చెరువులో నుంచి వెలికితీశారు.నెల రోజుల క్రితమే వివాహం చేసుకున్న ప్రశాంత్ మృతి వార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. తల్లిదండ్రులు, భార్య, కుటుంబీకుల రోదనలు అక్కడి వారిని కలచివేశాయి.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.చేపల వేటకు వెళ్లి తిరిగి రాని యువకుడు... 18 గంటల గాలింపు తర్వాత మృతదేహం లభ్యం... వీర్నపల్లిలో విషాద ఛాయలు.

# అజ్మీరా తండాలో ఘనంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ భూమిపూజ..

కోనరావుపేట మండలం /ప్రజాదివాస్ జూన్ 12



కోనరావుపేట మండలం పరిధిలోని అజ్మీరా తండాలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ అజ్మీరా జయరాం నాయక్, ఉప సర్పంచ్ కిషన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మానుక సత్యం కలిసి సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన పంచాయతీ భవన నిర్మాణం వల్ల తండా ప్రజలకు పాలనాపరమైన సేవలు మరింత సులభతరం అవుతాయని, గ్రామ సమగ్ర అభివృద్ధికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తండా అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, అలాగే తండా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం

**రూ. 50 వేల చెక్కు అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల, జూన్ -12ప్రజా దివాస్



ఇద్దరు దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం అందజేశారు. బోయినపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కళ్యాణం కొమురవ్వకు నలుగురు పిల్లలు. వారిలో ఇద్దరు దివ్యాంగులు. దివ్యాంగురాలైన సాగరిక, దివ్యాంగుడైన వేణు అనారోగ్యానికి గురయ్యారు. వారికి ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్లో వైద్యం చేయించారు.కొమురవ్వ భర్త గల్ఫ్ కు వెళ్లి అక్కడే మరణించారు. ఆమెకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు. పిల్లలను చూసుకోవడం కోసం తాను ఇంటికే పరిమితమై పోయినది. కూలి పనులకు సైతం కూడా వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి జిల్లా సంక్షేమ అధికారితో విచారణ చేయించి వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. దీంతో వారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం రూ.50 వేల చెక్కును అందజేశారు. భవిష్యత్తులో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తమ పిల్లలకు ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్ కు కొమురవ్వ కృతజ్ఞతలు తెలియజేశారు.

# అతి త్వరలో యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు

- మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలి
- అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు చేపట్టాలి
- సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశం
- శనివారం (రేపు) మంచిర్యాలలో 335 మంది వారసులకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడి

ప్రజా దివాస్

సింగరేణి :కార్మికులకు శుభవార్త. సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత శాసన సభ్యులు, మంత్రులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ అంశంపై కార్మికుల ఆందోళనలను వివరించారని చెప్పారు. ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు. ఇటీవల కాలం వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో శనివారం (ఈ నెల 13వ తేదీ) జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు.సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు.. ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ సింగరేణి...అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్సటర్నల్ పోస్టులు ఉండగా... 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు.కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు.ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఇదే కాకుండా బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే సింగరేణి ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు కూడా 40 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామన్నారు.ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణి



చరిత్రలోనే అత్యధికంగా కార్మికులకు లాభాల వాటాను చెల్లించామని తెలియజేశారు. గత రెండేళ్లలో రూ.1500 కోట్లను లాభాల వాటా రూపేనా చెల్లించినట్లు వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్ను చెల్లిస్తున్నామని, 2023-24లో ఒక్కొక్కరికీ రూ.5,000 చొప్పున, 2024-25లో రూ.5,500 చొప్పున లాభాల బోనస్ను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణిలో ప్రతీ ఉద్యోగికి అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో అన్ని ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ చేసేలా చర్యలు తీసుకోవడమే కాకుండా గోదావరిఖని లో క్యాథ్ ల్యాబ్ను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, డిపెండెంట్ పిల్లల వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు.తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి కార్మికుల పట్ల తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత మరియు వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.రాబోయే రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గు బ్లాక్లు సాధించేందుకు తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయన్నారు. ఒడిశా నైనీ బ్లాక్ అనుమతులతోపాటు బొగ్గు ఉత్పత్తికి ప్రజా ప్రభుత్వంలో తీసుకున్న ప్రత్యేక చొరవను గుర్తుచేశారు.రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణిని విస్తరించే దిశగా తాము ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే పోటీ మార్కెట్లో సింగరేణి నిల దొక్కుకోవాలంటే ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# బతుకమ్మ ఆడిన ఉపాధి హామీ పథకం మహిళలు

ప్రజా దివాస్



పుల్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో శుక్రవారం నాడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు పని ప్రదేశం వద్ద పని ముగిసిన తర్వాత బతకమ్మ ఆటలు ఆడుతూ ప్రజలను ఆకట్టుకున్నారు ఈ బతుకమ్మ ఆటలో జానపద గీతాలు పల్లె సుద్దులు ఇతర పాటలతో మహిళలు చిందులు వేస్తూ బతుకమ్మ ఆటను అంగరంగ వైభవంగా నిర్వహించారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వల్ల తమ గ్రామ నిరుపేదలము అందరూ కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్లి ఎంతో కొంత సంపాదించుకొని తమ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు తమకు ఎల్లప్పుడూ పనులు చూపించడంలో తమ ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు గారికి వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు ఇకముందు కూడా ఎప్పటికీ తమ గ్రామంలో ఉపాధి పనులు ఎప్పటికీ జరగాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వి ష్ణయ్య పలు పార్టీల నాయకులు గ్రామ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు

# విద్యా హక్కు చట్టాన్ని వెంటనే అమలు చేయాలి -తాండ్ర వెంకటేశ్వర్లు

ప్రజా దివాస్



బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ అంబేద్కర్ సెంటర్లో జిల్లా అధ్యక్షుడు కోల్లపూడి ప్రవీణ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జోన్ ఇంచార్జ్ తాండ్ర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని అలాగే ఫీజు నియంత్రణ కమిటీలు వేసి ప్రవేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజులతో దోపిడీ చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్న ప్రైవేట్ స్కూల్ల యజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా శాఖ మంత్రి అయిన రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేస్తున్నాం రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే విద్యార్థుల తల్లిదండ్రులను సమీకరించి పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు అబ్దుల్ అమీద్ ,అనసూయ, దేవి ,నాగరాజ్,సాయి, రాములు ,తదితరులు పాల్గొన్నారు

# సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిది

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నత్తి దశరథ్

ప్రజా దివాస్

జూన్ 12. పుల్కల్ ఉమ్మడి మండల పరిధిలోని కోర్పోల్ గ్రామంలో శుక్రవారం నాడు 19 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వివిధ నిరుపేదల కుటుంబ సభ్యులకు ఇలాంటి సీఎం సహాయ నిధి ఎంతగానో అవసరం పడుతుందని వారు అన్నారు నిరుపేదల సంక్షేమమే తమ కాంగ్రెస్ పార్టీ ప్రథమ లక్ష్యమని వారు కొనియాడారు అంతేకాకుండా నిరుపేదల పట్ల తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు వారికి అండగా



నిలుస్తుందన్నారు ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయలేని పనులు కేవలం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే అన్ని వర్గాలకు సమాన న్యాయం జరిగే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వారు అన్నారు ఇకముందు కూడా తమ మంత్రి దామోద రాజా నరసింహ ఆందోల్ నియోజకవర్గన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల నే దృఢనిశ్చయంతో ఉన్నారని వారన్నారు ఆందోల్ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తమ ఆందోల్ నియోజకవర్గాన్ని రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు తమ మంత్రివర్యులైన దామోదర్ రాజనర్సింహగారు ఎంతగానో కృషి చేస్తున్నారని వారు అన్నారు కావున ఎన్ని దుష్టశక్తులు తమ పార్టీపై అసత్య ఆరోపణలు చేసిన అభివృద్ధి పనులను మాత్రం ఆపలేరు అన్నారు కావున ఇప్పటికైనా అందరూ సహకరించి తమ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపే విధంగా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు

# ఇష్టపడి చదవండి.. లక్ష్యాన్ని సాధించండి..

- నాణ్యమైన విద్యకు చిరునామా ప్రభుత్వ విద్యాసంస్థలు..
- పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి
- పటాన్చెరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ

ప్రజా దివాస్



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇష్టపడి చదివి.. లక్ష్యాన్ని సాధించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. శుక్రవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులకు నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ డిజిటల్ ప్యానెల్స్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్య వ్యవస్థ బలోపేతానికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వంగరి అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్.

ప్రజా దివాస్

పటాన్చెరువు మండలం ఇంద్రేశం మున్సిపల్ కేంద్రం, పార్వతీపురం కాలనీలో నిర్వహించిన శ్రీమతి నగరాణి ఽ శ్రీ విద్యాసాగర్ గారి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో మాద్రి పృథ్వీరాజ్ గారు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వారి కొత్త ఇంటిలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నిండాలని ఆకాంక్షించారు.కొత్త ఇంటిలో కొత్త ఆనందాలు వెల్లివిరియాలని కోరుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజి రెడ్డి గారు, పటాన్చెరు మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్ గారు, రాజు గారు, ప్రశాంత్ గారు, విజయభాస్కర్ గారు తదితరులు పాల్గొన్నారు.



# బాధిత బాలికకు మెరుగైన వైద్యం అందించాలి

**మహబూబాబాద్ జిల్లా రజక వృతిదారుల సంఘం కార్యదర్శి పున్నం సారయ్య**




ప్రజా దివాస్

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలిక కుటుంబాన్ని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నాయకులు పరామర్శించి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా రజక వృతిదారుల సంఘం కార్యదర్శి పున్నం సారయ్య మాట్లాడుతూ...బాలికకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనకు బాధ్యుడైన నిందితుడిని వెంటనే రిమాండ్‌కు పంపించి, పోక్సో చట్టంతో పాటు హత్యాయత్నం/హత్య కేసులు నమోదు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక భవిష్యత్ వైద్యం, పునరావాసం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాసంఘాలు, సామాజిక సంస్థలు తమ మద్దతును కొనసాగిస్తాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన సహాయ సహకారాలు అందించకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి

- ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బడిబాటలో భాగంగా చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లిలోని గొల్లపల్లిలో ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం
- అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం, యూనిఫాంల పంపిణీ
- కిష్టంపేటలో పూర్వ ప్రాథమిక పాఠశాల పరిశీలన






చందుర్తి, జూన్ -12 ప్రజా దివాస్

ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, బోధనపై అవగాహన కల్పిస్తూ.. విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లిలోని గొల్లపల్లిలో ప్రాథమిక పాఠశాల రెండు ఏండ్ల కింద మూతపడగా, బడిబాటలో భాగంగా విద్యార్థుల ప్రవేశాలు కల్పించే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై.. విద్యాలయాన్ని పునః ప్రారంభించారు. అదే విద్యాలయం ఆవరణలో అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం యూనిఫామ్ లు పంపిణీ చేశారు. అలాగే కిష్టంపేటలో పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు వచ్చిన ఆటల పరికరాలు, బొమ్మలను పరిశీలించారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య, ఈ ఏడాది ఎంత మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారో ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పుస్తకాలు, నోట్ బుక్ లు, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తుందని తెలిపారు. విద్యార్థుల తల్లితండ్రులు ఆలోచించి.. తమకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలను చేర్పించాలని పిలుపు నిచ్చారు. సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతోపాటు ఆటలు ఉంటాయని వెల్లడించారు. పిల్లలు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని.. చదువుతోపాటు ఆటలు ఆడాలని సూచించారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ భూపతి, ఎంపీడీఓ రాధ, విద్యాశాఖ అధికారులు వినయ్ కుమార్, సతీష్, విద్య శాఖ, సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ డీజీపీ సి .వి ఆనంద్ ని గౌరవ పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన,,,ఎం ఆర్ పి ఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ


ప్రజా దివాస్




ఇటీవల నూతనంగా తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ )గా బాధ్యతలు చేపట్టిన సి .వి ఆనంద్ ఐపీఎస్ ని,ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్య క్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హైదరాబాద్ లోని డీజీపీ కార్యాలయంలో గౌరవ పూర్వకంగా కలవడం జరిగింది,, ఈ సందర్భంగా సి .వి ఆనంద్ కి మందకృష్ణ మాదిగ పుష్పగుచ్చం అందించి శాలువాకప్పి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది,,,ఈ సందర్భంగా ఎం ఆర్ పి ఎస్ మొదటి దశ ఉద్యమం జరుగుతున్న సందర్భంగా బషీర్ బాగ్ చౌరస్తాలో పోలీసు అధికారిగా విధులు నిర్వర్తించిన విషయాన్ని సి .వి ఆనంద్,గుర్తు చేసుకున్నారు,,పోలీసు శాఖలో అపారమైన అనుభవం కలిగిన సి .వి ఆనంద్ తెలంగాణ రాష్ట్ర డీజీపీ గా నియమితులు కావడం సంతోష కరమని మంద కృష్ణ మాదిగ అన్నారు,ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎ స్ రాష్ట్ర అధ్యక్షులు డా.గోవిందు నరేష్ మాదిగ,ఎం ఆర్ పి ఎస్ తెలంగాణ స్టేట్ సెక్రటరీ కొలికపోగు కాంతారావు మాదిగ,ఎం ఎస్ పి జాతీయ నేత తిప్పారపు లక్ష్మణ్ మాదిగ,ప్రముఖ రచయిత నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్,సినిమా దర్శకులు ప్రేమ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు,,,మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి,

# సినారె కవిత్వానికి అక్షర నివాళి దామోదర రాజనర్సింహ

ప్రజా దివాస్




తెలంగాణ తెలుగు తేజమా సినారె! గుండెల నిండా పూలవాన కురిపించిన గీతాల గంగోత్రివి నీవు, అత్తరు జల్లిన ఆనందలహరి కవిగా తెలుగు మనసుల తోటలో నిత్యం పరిమళించే మల్లెపూవివి."ఊపిరాడదంలేదు ఉక్కపోస్తుంది ఎ.సి. గదిలో, కారణం తెలుస్తుంది కవిత రాయలేదివాళ..." అని కవిత్వాన్నే శ్వాసగా మలుచుకున్న అక్షర యోగివి, భావాల భాస్కరుడివి."నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని" అని ప్రేమకు ప్రాణం పోసి, పదాలకు పరిమళం అద్ది, పాటలకు పల్లవిలా పలికిన మధుర గాన శిల్పివి.కలంలో దాగివున్న కవితలతలను అల్లుకొని, మానవత్వపు ముత్యాలను గేయాలుగా పేర్చి, ఆకాశాన అద్భుతాలు సృష్టించిన మేధావివి నీవు. నీ ప్రతి అక్షరం ఓ అమృతబిందువు, నీ ప్రతి గీతం ఓ జీవన సందేశం."విశ్వంభర"గా విశ్వమానవతను ఆవిష్కరించి, తెలుగు గజళ్లకు కొత్త వెలుగులు నింపి, సాహిత్య సీమలో జ్ఞానపీఠ శిఖరాన నిలిచిన అజరామర కీర్తి శిఖరాగ్రమువి.సినిమా పాటలకు సాహిత్య సుగంధం అద్ది, ప్రేమకు పవిత్రతను, ప్రకృతికి పరవశాన్ని, ప్రజలకు ప్రేరణను అందించిన మహాకవి నీవు.కాలం నీ దేహాన్ని తీసుకెళ్లినా, నీ కలం ఇంకా పలుకుతూనే ఉంది; తరాలు మారినా, నీ గీతాలు ఇంకా హృదయాలను తాకుతూనే ఉన్నాయి. తెలుగు జాతి ఉన్నంత కాలం "సినారె" అనే పేరు అక్షరాల ఆకాశంలో ధ్రువతారగా వెలుగుతూనే ఉంటుంది.అక్షరం నీ ఆత్మ... కవిత్వం నీ శ్వాస... తెలుగు జాతి గుండెల్లో శాశ్వతంగా నిలిచే చిరంజీవి జ్ఞాపకం నీవే సినారె!నీ వర్ధంతి సందర్భంగా మా హృదయాల నిండా కృతజ్ఞతా కుసుమాలు సమర్పిస్తూ, అక్షర శ్రద్ధాంజలితో నమస్కరిస్తున్నాం.సిలారపు దామోదర రాజనర్సింహ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

# సెర్ప్ మెగ్నరెగ్స్ సిబ్బందికి హెల్త్ క్యాంప్ వైద్య పరీక్షలు

- పాల్గొన్న హెల్త్ క్యాంపును జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీమతి ఎమ్ .విద్యాచందన

ప్రజా దివాస్

కొత్తగూడెం :గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య దేవరాజన్ ఐఏఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం ఐ డి ఓ సి సమావేశ మందిరంలో జిల్లాలో పనిచేస్తున్న సెర్ప్ , మెగ్నరెగ్స్ సిబ్బందికి ఎరిక్సన్ ఇన్సూరెన్స్ టి ఏ పి ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారు సౌజన్యంతో హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ హెల్త్ క్యాంపును జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీమతి ఎమ్ .విద్యాచందన పరిశీలించి, సెర్ప్ , మెగ్నరెగ్స్ లలో పనిచేస్తున్న సిబ్బంది అందరూ 40 సంవత్సరాలు పైబడిన వారే కావడం వలన ఇటువంటి హెల్త్ క్యాంపులు వారికి ఎంతగానో ఉపయోగపడతాయని, దైనందిన పని ఒత్తిడిలో సిబ్బందికి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి సంవత్సరం ఇటువంటి హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. ఈ యొక్క హెల్త్ క్యాంపు నందు 106 మంది సెర్ప్ సిబ్బంది 96 మంది ఈజీఎస్‌డ ఇతర శాఖల సిబ్బంది మొత్తం 202 మందికి ఈ క్రింది వైద్య పరీక్షలు నిర్వహించారు. 1) బిపి,2) షుగర్, 3) క్యాల్షియం టెస్ట్, 4) కొలెస్ట్రాల్ టెస్ట్, 5) లిపిడ్ ప్రొఫైల్7) 2 డీ ఎకో కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించారు. 6) ఈసీజీ ,ఈ హెల్త్ క్యాంపులను యశోద హాస్పిటల్, మలక్ పేట్, హైదరాబాద్ పాత్ క్రైండ్ (పాథక్రైండ్ లాబోరేటరీస్ హైదరబాద్ శరత్ మాక్స్ విజన్ వరంగల్ వారి సహకారంతో ఎరిక్సన్ ఇన్సూరెన్స్ టీపీఏ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారు నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపు నందు మొత్తం 202 మంది ఉద్యోగులు హాజరై పరీక్షలు చేయించుకోవడమైనది.

# బతుకమ్మ ఆడిన ఉపాధి హామీ పథకం మహిళలు

ప్రజా దివాస్



పుల్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో శుక్రవారం నాడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు పని ప్రదేశం వద్ద పని ముగిసిన తర్వాత బతకమ్మ ఆటలు ఆడుతూ ప్రజలను ఆకట్టుకున్నారు ఈ బతుకమ్మ ఆటలో జానపద గీతాలు పల్లె సుద్దులు ఇతర పాటలతో మహిళలు చిందులు వేస్తూ బతుకమ్మ ఆటను అంగరంగ వైభవంగా నిర్వహించారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వల్ల తమ గ్రామ నిరుపేదలము అందరూ కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్లి ఎంతో కొంత సంపాదించుకొని తమ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు తమకు ఎల్లప్పుడూ పనులు చూపించడంలో తమ ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు గారికి వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు ఇకముందు కూడా ఎప్పటికీ తమ గ్రామంలో ఉపాధి పనులు ఎప్పటికీ జరగాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వి ష్ణయ్య పలు పార్టీల నాయకులు గ్రామ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు

# ఆత్మకూరులో అంగన్వాడి భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

ప్రజా దివాస్



శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అంగన్వాడీలని,గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రీ ప్రైమరీ స్కూల్ లు ఏర్పాటు చేయబోతున్నామని, డైట్ చార్జెస్ పెంపు, అత్యాధునిక విద్యా ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల విద్యాభివృద్ధికి, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో కీలకమని తెలిపారు.పిల్లలకు పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు అందించే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# చట్టపర చర్య తీసుకోవాలి ఎమ్మార్పీఎస్ డిమాండ్

ప్రజా దివాస్


ఇప్ప రవీనపట్ల మానసిక వేధింపులకు గురి చేస్తున్న దుర్గం తిరుపతి ఉప సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుర్గం రవీందర్. లను వెంటనే అరెస్టు చేయాలి ఎమ్మార్పీఎస్ డిమాండ్ రెబ్బెన మండలంలోని గోలేటి టౌన్షిప్ లో నివసిస్తున్న ఇప్ప రవీణ భర్త ఇవ్వ ప్రసాద్ సింగరేణి సంబంధిత ప్రైవేట్ సంస్థలో సెక్యూరిటీ గాడుగా విధులు నిర్మిస్తున్నారు వారి ఇంటి ఎదురుగా ఉన్న దుర్గం రవీందర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుర్గం తిరుపతి కాంగ్రెస్ పార్టీ ఉప సర్పంచ్ వీరిద్దరూ కలిసి గడిచిన రెండు సంవత్సరాల నుండి ఈ కుటుంబాన్ని వేధిస్తున్నా రవి తెలుసుకొని ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు మాదిగ ఎమ్మార్పీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర జిల్లా మండల నాయకులు ఇప్ప రవి నాప్రసాద్ కుటుంబాన్ని కలిసి జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకోవడం జరిగింది ప్రవీణ చెప్పిన మాటలు వినిబాధపడి ఆ అమ్మాయి స్నానం చేస్తున్నప్పుడు ఇల్లు శుభ్రం చేస్తున్నప్పుడు ఇంటి ముందు ముగ్గు వేస్తున్నప్పుడు రకరకాల అశ్లేలకు సంబంధించిన వీడియోలు తీసి ఆమెని బ్లాక్మెయిల్ చేయడం రాక్షస చర్య అని ఆగ్రహించడం జరిగింది ఈ దుశ్చర్యకు. పాలు పడుతున్న ఉప సర్పంచ్ దుర్గం తిరుపతిని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుర్గం రవీందర్ ఇద్దరినీ కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ లేనిపక్షమున జిల్లా వ్యాప్తంగా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేయడం జరుగుతుంది మీరు ఇద్దరూ రాజకీయ అండ చూసి 800 క్వార్టర్లలో 176 అనుమతి లేకుండా ఉంటున్నారు 60 కుటుంబాలుకిరాయిస్తూ జీవిస్తున్నారు ఎవరికి లేని నిబంధనలు ఇప్ప ప్రసాద్ కఠిన చర్యలు తీసుకోవడం కరెంటు కట్ చేయడం ఇది ఏమైనా చర్య కాంగ్రెస్ పార్టీ నాయకులైన దుర్గం రవీందర్ ఎ తిరుచపతి వీరు కూడా కిరాశీయి క్వాటర్లలోనే ఉంటున్నారు సింగరేణి క్వార్టర్లలో రెంటుకు ఉంటున్న ఇండ్లకు కూడా కరెంటు కట్ చేయాలి లేదా ప్రసాద్ ఇంటికి కరెంటు కనెక్షన్ వెంటనే కల్పించాలి భవిష్యత్తులో ఇప్ప ప్రసాద్ కుటుంబం పట్ల ఆయన భార్య బిడ్డలకు




దుర్గం రవీందర దుర్గం తిరుపతి అను వారు ఎలాంటి చర్యలకు పాల్పడకుండా ఇప్ప ప్రతాప్ కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలి ప్రతి కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పొన్నాల నారాయణ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఇప్ప నాగరాజు మాదిగ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మారెపల్లి అంబేద్కర్ మాదిగ కోర్రాల రాజేందర్ మాదిగ సిరికొండ జనక్ ప్రసాద్ మాదిగ జంగాపల్లి రాజేష్ మాదిగ భోగరం ప్రతాప్ మాదిగ సలి గోమ్ముల దాసు మాదిగ ఇప్ప ప్రసాద్ మాదిగ

# జర్నలిస్టుల సంక్షేమ సంఘం సమస్యల పరిష్కార పోరాటానికి కొత్త బాధ్యత

**జెఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా తొగరు పవన్ కుమార్ నియామకం...**



ప్రజా దివాస్

దుగ్గొండి: రాష్ట్రవ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం (జెఎస్ఎస్) నూతన రాష్ట్ర కార్యదర్శి తొగరు పవన్ కుమార్ పేర్కొన్నారు. జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం (రిజిస్ట్రేషన్ నం. 914/2015) వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్. శ్రీనివాస్, జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కానుగంటి రాజు గురువారం హైదరాబాద్‌లో దుగ్గొండి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన తొగరు పవన్ కుమార్‌ను సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా తొగరు పవన్ కుమార్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలు, సంఘం బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వ స్థాయిలో కూడా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. తొగరు పవన్ కుమార్ నియామకంపై పలువురు జర్నలిస్టులు, సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# అంగరంగ వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం శ్రీ మణికంఠ నవయుగ కోలాటం బృందం శ్రీ హనుమాన్ కోలాట భజన బృందం

ప్రజా దివాస్

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం మంగళికుంట తండా గ్రామంలో బొడ్రాయి వార్షికోత్సవం అంగరంగ వైభవంగా మేళతాళాలతో అయ్య వేదమంత్రాలతో కోలాటాల ఆటపాటలతో గ్రామస్తులు అందరూ మహిళలు బోనాలతో చక్కని ఆట సంగీత సవాయిద్యాలతో ఘనంగా నిర్వహించడం జరిగింది వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు బంధువులు అందరూ విరివిగా సంతోషంగా పాల్గొని పాలు పొంగళ్ళు బోనాలు సమర్పించి అమ్మవారిని గ్రామం అందరూ ఈ పాడి పంటలతో చల్లగా ఉండాలని గ్రామ సర్పంచ్ భూఖ్య రవి మాజీ సర్పంచ్ రవి మాజీ ఉపసర్పంచ్ బాల్య ప్రస్తుతం ఉప సర్పంచ్




రమేష్ గ్రామ పెద్దలందరూ హుస్సేన్ పట్వారి తావూరియా రామారావు తులసి రామ్ ఇంకా గ్రామ పెద్దలు అందరూ కలిసి అందరి సహకారంతో వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు ఈ సందర్భంగా శ్రీ మణికంఠ నవయుగ కోలాటం బృందాలు శ్రీ హనుమాన్ కోలాట భజన బృందం ఆ గ్రామ సభ్యులు అలాగే సంప్రదాయక నృత్యం వారి నృత్యంతో ఆటపాటలతో బోనాలు సమర్పించారు అనంతరం అన్నదాన కార్యక్రమం జరుపబడింది అన్నదాన కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని సంతోషాన్ని వ్యక్తం చేశారు ఇటువంటి చక్కని కార్యక్రమం సహకరించినటువంటి పెద్దలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని మాస్టర్ మణికంఠ గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ గ్రామ దేవత బొడ్రాయమ్మ తల్లిని ముత్యాలమ్మ తల్లిని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించి ప్రార్థించుకోవడం జరిగింది

# అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించిన నాగేష్ శర్మ



ప్రజా దివాస్

ఆర్మూర్ పట్టణ క్షత్రియ ఫంక్షన్ హాల్ లో అధికమాసం సందర్భంగా నాగేష్ శర్మ గురు స్వామి తన సొంతంగా అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. ఈ మహా పడిపూజలో ఎవరైతే అయ్యప్ప మాల ధారణ 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సుమారు 100 స్వామి దంపతుల కు గురుస్వామి ఆధ్వర్యంలో సత్కారం. ఈ సందర్భంగా నగేష్ శర్మ గురుస్వామి మాట్లాడుతూ ఈరోజు అయ్యప్ప మహా పడిపూజ ఫంక్షన్ హాల్ లో నిర్వహించి, మణికంఠుడికి అభిషేకం చేస్తూ, మెట్లు ముట్టిచ్చి, హారతి , అధికమాసం ము అధికస్తే అధిక బలం అంటూ, ఈ మాసంలో ఎలాంటి పూజ కార్యక్రమాలు గాని, దానధర్మాలు కానీ, గంగ సానాలు, పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటే అనంత కోటి ఫలితాలు వస్తాయని మన శాస్త్ర ప్రకారంగా ఈరోజు అధికమాసం పురస్కరించుకొని, మహా పడిపూజ, ఎవరైతే గురు స్వామీలు 18 సంవత్సరాలు పూర్తి చేశారు ,99 కుటుంబ దంపతులకు సన్మానించడం జరిగింది, ఇట్టి కార్యక్రమానికి పాల్గొనందున పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ, అలాగే ఈ కార్యక్రమానికి మన ఒక జిల్లా కాకుండా, ఇతర నిర్మల్ జిల్లా నుంచి, ఆదిలాబాద్, బైంసా, హైదరాబాద్, ఆర్మూర్ ఆర్మూర్ మండల్ నుంచి వచ్చిన స్వాములకు కూడా పేరుపేరునా ధన్యవాదములు, అందరికీ అయ్యప్ప స్వామి ఆశీస్సులు, మీకు మీ కుటుంబ సభ్యులకు ఉండాలని, స్వామివారి అన్నప్రచారం అందరూ అర్చన భక్తులు స్వీకరించాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో మణికంఠ సేవా సమితి అధ్యక్షుడు, కార్యదర్శి, ధనంజయ స్వామి, శ్రీహరి స్వామి, సురేష్ స్వామి, ఉదయ స్వామి, విజయ స్వామి,స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏడు అడుగుల కొండచిలువ కలకలం..

**- సురక్షితంగా రెస్క్యూ చేసిన అటవీశాఖ**
**- ఆత్మకూరు గ్రామ శివారులో ప్రత్యక్షం.. జూపార్క్‌కు తరలింపు**

ప్రజా దివాస్

హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం ఆత్మకూరు గ్రామంలోని గుడెప్పాడ్ జాతీయ రహదారి పరిసర ప్రాంతంలో శుక్రవారం (12 జూన్ 2026) ఏడు అడుగుల పొడవున్న కొండచిలువ సంచరిస్తూ కనిపించడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే హన్మకొండ అటవీశాఖ డిప్యూటీ రేంజర్ వై. కోటేశ్వర్ రావు, హన్మకొండ జూపార్క్ సిబ్బంది వాచర్ అశోక్, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ హన్మకొండ జిల్లా సభ్యుడు మారపెల్లి సునీల్ సంఘటన స్థలానికి చేరుకుని కొండచిలువను సురక్షితంగా రెస్క్యూ చేసి బంధించి జూపార్క్‌కు తరలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజర్ వై. కోటేశ్వర్ రావు మాట్లాడుతూ కొండచిలువలు విషపూరితమైనవి కావని, సాధారణంగా మనుషులకు హాని చేయవని తెలిపారు. ప్రజలు భయాందోళనలకు గురై వాటికి హాని చేయవద్దని సూచించారు. వన్యప్రాణులను చంపడం వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం శిక్షార్హమైన నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవి




జంతువులు లేదా పాములు జనావాసాల్లో కనిపించినప్పుడు వాటిని చంపేందుకు ప్రయత్నించకుండా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పత్రిక & ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల సమావేశంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ దేశ్ పాండే.

ప్రజా దివాస్

గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు 12 సంవత్సరాలు పాలన పురస్కరించుకున్న సందర్భంగా సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొనడం జరిగింది. గడిచిన 12 ఏండ్లలో పేదల సంక్షేమమే పరమావధిగా మోదీ గారు దేశంలో సుపరిపాలనను అందిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా సేవ చేసిన దేశ ప్రధానిగా మోదీ గారు సరికొత్త చరిత్రను సృష్టించారు. అట్టడుగు వర్గాల సంక్షేమం (అంత్యోదయ) నుండి దేశ రక్షణ,




డిజిటల్ విప్లవం, ఆర్థిక సంస్కరణల వరకు ప్రతి రంగంలోనూ భారత్‌ను అగ్రగామిగా నిలిపిన ఘనత మోదీ గారికి దక్కింది. మన గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా ముందుకు సాగుతుంది. ఈ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి గారు, మాజీ ఎంపీ బీబీపాటిల్ గారు, మాజీ ఎమ్మెల్యే శ్రీ విజయపాల్ రెడ్డి గారు, బీజేపీ జిల్లా మీడియా ఇంచార్జి శ్రీ విఠల్ గారు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ రాజశేఖర్ రెడ్డి గారు, శ్రీ జగన్ గారు, బీజేపీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ మాణిక్ రావు గారు, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీ భాస్కర్ గారు, తదితరులు ఉన్నారు.

# గుమ్మడిదల మైత్రి డ్రగ్స్ టెక్నాలజీ సెంటర్ పరిశ్రమలో విషాదం



ప్రజా దివాస్
జూనియర్ ఎగ్జిక్యూటివ్ కార్మికుడు మృతి - విధులు నిర్వహిస్తుండగా ప్రమాదానికి గురైన జూనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రవీణ్ కుమార్ (25)- చికిత్స పొందుతూ మృతి చెందిన కార్మికుడు- మృతుడు మెదక్ జిల్లా హత్నూర మండలం కసల గ్రామానికి చెందిన వ్యక్తి - మూడు రోజుల క్రితం పరిశ్రమలో ప్రమాదం- విషయం బయటకు రాకుండా సమీపంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలింపు- ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్ ఆస్పత్రికి తరలింపు- చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రవీణ్ కుమార్ - ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది - పరిశ్రమ భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు వ్యక్తం చేస్తున్న స్థానికులు, కార్మికులు - మృత కార్మికుడి కుటుంబానికి మద్దతుగా సీపీఎం కార్మిక నాయకులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న కార్మిక సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు...

# హుస్నాబాద్‌లో ఘనంగా 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన సదస్సు

- ముఖ్య అతిథిగా హాజరైన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- డ్రైవర్లకు ఖాకీ దుస్తులు, మెడికల్ ఫస్ట్ ఎయిడ్ కిట్లు , హెల్మెట్ పంపిణీ

ప్రజా దివాస్
ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచి, ప్రమాదాల నివారణే ధ్యేయంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్స్‌లో భారీ రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతిథులుగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ (సీపీ) రష్మి పెరుమాళ్ ఖూా, జిల్లా కలెక్టర్ లికె. హైమావతి ఖూాలి పాల్గొన్నారు. ప్రమాద రహిత సమాజం కోసమే 'అరైవ్ అలైవ్': సీపీ రష్మి పెరుమాళ్ ఖూా ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, సదస్సులో ప్రదర్శించిన రోడ్డు ప్రమాదాల వీడియోలను చూసైనా ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని కోరారు. ఇటువంటి పరిస్థితి ఏ కుటుంబానికి రాకూడదనే ఉద్దేశంతోనే పోలీస్ శాఖ మీ ముందుకు వచ్చి ఈ అవగాహన కల్పిస్తోందని అన్నారు. సీపీ తన ప్రసంగంలో పలు కీలక సూచనలు చేశారు: ద్విచక్ర వాహనంపై ఇద్దరు ప్రయాణిస్తే ఇద్దరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, అప్పుడే ఇద్దరికీ రక్షణ ఉంటుంది. చిన్న పిల్లలను బైక్ ముందు కూర్చోబెట్టుకోవడం చాలా ప్రమాదకరం, అతివేగం వద్దు.. పనులకు వెళ్లేటప్పుడు కొంచెం ముందుగానే బయల్దేరాలనీ సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు నిద్ర వస్తే బలవంతంగా డ్రైవ్ చేయకుండా, ఒక 30 నిమిషాల పాటు విశ్రాంతి తీసుకోవాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ (మద్యం సేవించి వాహనం నడపడం) చేయరాదు. పట్టుబడితే రూ.10,000 వరకు జరిమానా విధిస్తారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇళ్లకు చేరాలన్నదే 'అరైవ్ అలైవ్' కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ సదస్సుకు వచ్చిన వారు ఇక్కడి విషయాలను తమ ఇళ్లలోని వారికి కూడా వివరించాలని కోరారు. సిద్దిపేటను 'ట్రాఫిక్ చలాన్ రహిత జిల్లా'గా మార్చాలి: కలెక్టర్ కె. హైమావతి ఖూా జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు ఎక్కడో లేదా ఎవరికో జరుగుతాయి, మనకు జరగవు అనే భ్రమలో ఉండవద్దని హెచ్చరించారు. జిల్లాలో ప్రతిరోజూ ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరవడం సంతోషకరమని, మహిళలు ఇక్కడి సందేశాన్ని తమ ఇంట్లోని పురుషులకు, పిల్లలకు వివరించి వారిలో మార్పు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదంలో కుటుంబంలో ఏ ఒక్కరిని కోల్పోయినా ఆ వెలితిని ఎవరూ తీర్చలేరని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియమాలను పాటించి, లిసిద్దిపేట జిల్లాను 'ట్రాఫిక్ చలాన్ రహిత జిల్లా'గా మార్చాలని, జిల్లావాసులంతా సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రమాద బాధితులను కాపాడితే రూ.25,000 'రహవీర్' అవార్డు: మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, 99వ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్‌లో ఈ రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోలీస్ మరియు రవాణా శాఖలు సంయుక్తంగా ప్రజల సంక్షేమం కోసమే ఈ కార్యక్రమాన్ని చేపట్టాయన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన మొదటి గంటలోగా (గోల్డెన్ అవర్) బాధితులను ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడితే ప్రభుత్వం నుండి రహవీర్ అవార్డ్ అందిస్తామన్నారు. యువత డ్రగ్స్ మరియు మత్తు పదార్థాలకు దూరంగా







ఉండాలని, అవి ఆరోగ్యానికి తీవ్ర హానికరం అని హెచ్చరించారు. పిల్లలు ప్రయోజకులుగా ఎదగాలంటే తల్లిదండ్రులు వారిపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

సదస్సులో మంత్రి చేయించిన మూడు ప్రమాణాలు :

1. హెల్మెట్ లేకుండా బయటకు వెళ్లకూడదు అని.
2. సెల్ ఫోన్ మాట్లాడుకుంటూ డ్రైవింగ్ చేయము.
3. మద్యం సేవించి వాహనం నడపము

అనంతరం కార్యక్రమానికి హాజరైన వారందరితో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రవాణా రంగ డ్రైవర్లకు ఖాకీ యూనిఫారాలు మరియు మెడికల్ ఫస్ట్ ఎయిడ్ కిట్లను, హెల్మెట్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, హుస్నాబాద్ ఏసిపి సదానందం, సిఐ శ్రీను, ఎస్ఐ లక్ష్మ రెడ్డి, పోలీస్ అధికారులు, రవాణా శాఖ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ముగిసిన టీజిఐఐసి ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్

- విజేతలకు బహుమతులు అందజేసిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎం.డి శశాంక
- గచ్చిబౌలి ఐ.ఎస్.బి లో ఘనంగా ముగింపు వేడుకలు





ప్రజా దివాస్
రెండు రోజుల పాటు ఘనంగా జరిగిన టీజిఐఐసి ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ మూడో రోజైన శుక్రవారం ఉద్యోగుల సాంస్కృతిక వేడుకల తో ముగిసింది. శుక్రవారం గచ్చిభౌలి ఐఎస్ బి లోని ఖేంకా ఆడిటోరియం లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల లో టీజిఐఐసి ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డాన్స్ లు చేస్తూ , పాటలు పాడుతూ ఆనందంగా గడిపారు. అనంతరం రెండురోజుల పాటు జరిగిన క్రీడా పోటీల్లో గెలిచిన విజేతలకు టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎండీ శశాంక లు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు వీలైనప్పుడల్లా తమ హాబీ లకు పదును పెట్టాలని, తద్వారా మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీజిఐఐసి ఈడి లు పవన్, వీరారెడ్డి లతో పాటు సంస్థ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దుబాయిలో 'బుర్జీల్' ప్రతినిధులను కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

- రోడ్డు ప్రమాద బాధితులకు భారీ సహాయం ప్రకటించిన డా. షంషీర్ వయలిల్ ను హైదరాబాద్ కు ఆహ్వానించిన ఎమ్మెల్యే
- మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష దిర్హంలు (రూ. 26 లక్షలు) సహాయం

ప్రజా దివాస్
ఇటీవల దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురు కార్మికులు, గాయపడిన తొమ్మిది మందికి 10 లక్షల దిర్హంలు (రూ. 2.60 కోట్లు) మానవతా సహాయ ప్యాకేజీ ప్రకటించిన యూఏఈ కి చెందిన బుర్జీల్ హోల్డింగ్స్ చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త, బిలియనీర్ డా. షంషీర్ వయలిల్ కు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు. డా. షంషీర్ వయలిల్ అందుబాటులో లేనందున, ఆయన కంపెనీ ప్రతినిధులు ఎ. విజయ కుమార్, అహ్మద్ బిన్ సులేమాన్, ఎం. ఉన్ని కృష్ణన్, డా. పంకజ్



కుమార్ భట్ లను శుక్రవారం దుబాయిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మెంబర్ కొట్టాల సత్యం గౌడ్, దుబాయి లోని తెలంగాణ సామాజిక కార్యకర్తలు జువ్వాడి శ్రీనివాస రావు, శామ్యూల్ దామెర, సలావుద్దీన్, ఎస్వి రెడ్డి, ద్యాగతి మహిపాల్ యాదవ్, సుతారి సత్యనారాయణ, కోరెపు మల్లేష్, ఎమ్మెల్యే పిఎ ముత్యం శంకర్ తదితరులున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం, డా. షంషీర్ వయలిల్ తో సహా 'బుర్జీల్' ప్రతినిధులను హైదరాబాద్ కు ఆహ్వానించారు. సీఎం ఏ. రేవంత్ రెడ్డి సమక్షంలో మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేద్దామని ప్రతిపాదించారు. ప్రమాదంలో మృతిచెందిన ఏడుగురిలో, ముగ్గురు జగిత్యాల జిల్లాకు చెందిన వారున్నారు. ఒక్కొక్కరికి లక్ష దిర్హంలు (రూ. 26 లక్షలు) చొప్పున ఆర్థిక సహాయం అందనున్నది. గాయపడిన తొమ్మిది మందికి వైద్య చికిత్స, పునరావాసం, ప్రభావిత కుటుంబాల పిల్లల విద్య కోసం కూడా సహాయం చేస్తారు. అంతకు ముందు రోజు ఎమ్మెల్యే దుబాయి లోని భారత రాయబార కార్యాలయాన్ని సందర్శించి కాన్సులేట్ అధికారులను కలుసుకున్నారు. మృతదేహాల తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని రాషేద్ ఆసుపత్రిలో పరామర్శించారు. కాగా ఎమ్మెల్యే పర్యటనను దుబాయి లోని సామాజిక కార్యకర్తలు గుండెల్లి నర్సింలు, సుతారి సత్యనారాయణ, హైదరాబాద్ నుంచి ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, మెంబర్ నంగి దేవేందర్ రెడ్డి లు సమన్వయం చేశారు.

# దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం

- రూ. 50 వేల చెక్కు అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఇద్దరు దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం అందజేశారు.



ప్రజా దివాస్
బోయినపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కళ్యాణం కొమురవ్వకు నలుగురు పిల్లలు. వారిలో ఇద్దరు దివ్యాంగులు. దివ్యాంగురాలైన సాగరిక, దివ్యాంగుడైన వేణు అనారోగ్యానికి గురయ్యారు. వారికి ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్లో వైద్యం చేయించారు. కొమురవ్వ భర్త గల్ఫ్ కు వెళ్లి అక్కడే మరణించారు. ఆమెకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు. పిల్లలను చూసుకోవడం కోసం తాను ఇంటికే పరిమితమై పోయినది. కూలి పనులకు సైతం కూడా వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి జిల్లా సంక్షేమ అధికారితో విచారణ చేయించి వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. దీంతో వారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం రూ.50 వేల చెక్కును అందజేశారు. భవిష్యత్తులో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తమ పిల్లలకు ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్ కు కొమురవ్వ కృతజ్ఞతలు తెలియజేశారు.

# దురంధర్ బాగా నచ్చింది: పవన్ కళ్యాణ్



ఈ మధ్య కాలంలో ఇండస్ట్రీలో సూపర్ హిట్ అందుకున్న చిత్రం 'ధురంధర్'పై ఇప్పటికే సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా దీని ఫ్యాన్స్ లిస్ట్‌లో అగ్ర కథానాయకుడు పవన్ చేరారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన 'ధురంధర్', 'బారాముల్లా' చిత్రాల గురించి మాట్లాడారు. 'ధురంధర్' మొదటి భాగం తనకు నచ్చిందని పవన్ చెప్పారు. కథను చాలా ధైర్యంగా చూపించారని అన్నారు. దర్శకుడు ఇలాంటి గొప్ప కథను తెరకెక్కించిన విధానం ఆకట్టుకుందన్నారు. ముఖ్యంగా మేకింగ్ స్టైల్ బాగుందని ప్రశంసించారు. తాను బిజీగా ఉండడం వల్ల 'ధురంధర్ 2' చూడలేకపోయినట్లు వెల్లడించారు. ఇక తనకు హారర్ జానర్ సినిమాలంటే ఇష్టమని తెలిపిన పవన్ 'బారాముల్లా' గురించి ప్రస్తావించారు. 1980ల చివర్లో తాను షూటింగ్‌ల కోసం శ్రీనగర్ వెళ్లిన రోజులను గుర్తుచేసుకున్నారు. 'నాకు హారర్ సినిమాలు చూడడం అంటే ఆసక్తి. అవి మన మనసును కథలో పూర్తిగా లీనం చేస్తాయి. నాకు నిద్ర రానప్పుడు ఏదైనా హారర్ సినిమా చూస్తాను. కశ్మీర్ నేపథ్యంలో తెరకెక్కిన 'బారాముల్లా' నాకు పాత జ్ఞాపకాలను గుర్తుచేసింది. నేను 1987-1989లో షూటింగ్‌ల కోసం కశ్మీర్ వెళ్తుండేవాడిని. అప్పుడే అక్కడ గందరగోళాన్ని స్వయంగా చూశాను. కశ్మీరీ పండిట్లు పడిన బాధలను గమనించాను. ఎవరైనా గెట్‌అవుట్.. ఇక్కడినుంచి వెళ్లిపోండి అంటే నాకు నచ్చదు. దాన్ని భరించడం చాలా కష్టం. బహుశా 'బారాముల్లా'లో ఉన్న ఆ భావోద్వేగమే నాకు సినిమా నచ్చేలా చేసిందేమో' అని చెప్పారు.

# ఇరుముడితో అదృష్టం వెతుక్కుంటున్న భవానీ శంకర్




న్యూస్ ప్రజెంటర్ నుండి హీరోయిన్‌గా ఛేంజైన చెన్నై పొన్ను ప్రియా భవానీ శంకర్ అనతికాలంలోనే యా÷-టక్రెస్‌గా ఐడెంటిటీని దక్కించుకుంది. సపోర్టింగ్ రోల్స్ చేసుకుంటూ.. సెల్ఫ్ మేడ్ హీరోయిన్‌గా మేకోవర్ అయ్యింది. కోలీవుడ్‌లో ప్రూవ్ చేసుకున్న ఈ బ్యూటీ.. టాలీవుడ్‌లో మాత్రం సక్సెస్ కోసం స్ట్రగుల్ ఫేస్ చేస్తోంది. తెలుగులో ఇప్పటి వరకు చేసిన త్రీ మూవీస్ ప్లాప్సే. సంతోష్ శోభన్ హీరోగా తెరకెక్కిన కళ్యాణం కమనీయంతో టాలీవుడ్ తెరంగేట్రం చేసింది ప్రియా భవానీ శంకర్. కానీ ఈ సినిమా వచ్చి పోయిన విషయం తెలియదు ఆడియన్స్‌కు. కానీ దూత వెబ్ సిరీతో చేరువైంది. ఇందులో నాగ చైతన్య భార్యగా కరెప్టెడ్ జర్నలిస్ట్‌గా నటించింది. ఈ సిరీస్.. గోపీచంద్‌తో భీమ, సత్య దేవ్ జీబ్రాలో నటించే తెచ్చిపెట్టింది కానీ, ఈరెండు బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడటంతో టీటౌన్‌లో అవకాశాలు తగ్గాయి. కోలీవుడ్ ఆఫర్స్‌తో కాలం నెట్టుకొస్తున్న ప్రియాకు.. మరొక ఛాన్స్ ఇస్తోంది టాలీవుడ్ . శివ నిర్వాణ-రవితేజ కాంబోలో తెరకెక్కుతోన్న ఇరుముడిలో నటిస్తోంది. రవితేజకు భార్యగా కావేరి పాత్రలో కనిపించబోతుంది. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఫిల్మ్. షూటింగ్ కంప్లీట్ కావడంతో సెట్స్‌లోని పిక్స్ సోషల్ మీడియాలో పంచుకుంది ప్రియ. అలాగే దూత సీక్వెల్‌లోనూ కంటిన్యూ కాబోతుంది. రీసెంట్లీ ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ప్రియా ఎ÷-లాప్స్ పట్టించుకోకుండా టాలీవుడ్ ఆఫర్స్ ఇస్తోంది.. మరీ మేడమ్ వాటిని సద్వినియోగం చేసుకుంటుందో లేదో.

## సింగీతం.. దర్శక భీష్మాచార్యులు

## సింగ్ గీతం విజయం సాధించాలన్న చిరంజీవి






తెలుగు సినిమా పరిశ్రమకు సింగీతం శ్రీనివాసరావు భీష్మాచార్యుడని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. 94 ఏళ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు ప్రయోగాత్మకంగా తెరకెక్కించిన చిత్రం 'సింగ్ గీతం' . నాగ్ అశ్విన్ నిర్మాతగా వ్యవహరించారు. జూన్ 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు శుభాకాంక్షలు చెబుతూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. సింగీతం శ్రీనివాసరావు.. తెలుగు సినిమా పరిశ్రమకు ఆస్తి, ఒక నిధి. దర్శకుడిగా ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించడమే కాకుండా, ఎంతోమంది కళాకారులకు అవకాశాలు కల్పించి వారి జీవితాలకు మార్గదర్శకుడయ్యారు. అలాంటి మహోన్నత వ్యక్తి దర్శకత్వంలో రూపొందిన 'సింగ్ గీతం' ఈనెల 12న విడుదల కానుంది. ఇది ఇండియన్ సినిమాలో మరొక మైలురాయిగా నిలవాలని, పెద్ద విజయం సాధించాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అలాగే ఇలాంటి పెద్దలను గౌరవిస్తూ, వారి అనుభవాన్ని కొత్తతరానికి అందించే ఆలోచనతో ఈ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత నాగ్ అశ్విన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ఒకవైపు ఆనాటితరానికి ప్రతినిధిగా నిలిచిన సింగీతం మరోవైపు ఈతరం ఆలోచనలను ప్రతిబింబించే నాగ్ అశ్విన్.. వీరి కాంబో ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది. అలాగే ఈ చిత్రానికి, నాకెంతో ఇష్టమైన దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించడం మరింత ఉత్సాహాన్ని కలగజేస్తుంది' అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇందులోభాగమైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అయాన్, అహల్య, శాలిని ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'సింగ్‌గీతం'. ఇది ఓ గ్రామంలోని ప్రజలకు ఎదురైన వింత సమస్య చుట్టూ తిరిగే కథ. కొన్ని అనూహ్య పరిణామాల తర్వాత ఆ ఊరి వాసుల సాధారణ మాటలన్నీ పాటలుగా మారిపోతాయి. ఈ

# బాలయ్య కొత్త చిత్రం..ఎన్బీకె 111 టీజర్




గాడ్ ఆఫ్ మాసెస్.. ఈ ట్యాగ్ కి అర్హత ఉన్న ఏకైక టాలీవుడ్ నటుడు నందమూరి నటసింహం బాలకృష్ణ మాత్రమే. అసలు మాస్ అంటే బాలయ్య.. బాలయ్య అంటే మాస్. టాలీవుడ్ మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ బాలయ్య. దాదాపు మూడు దశాబ్దాల క్రితమే మాస్ సినిమా అంటే ఎలా ఉంటుందో.. ముద్దుల మావయ్యతో మాస్ హిట్ అందుకున్న బాలయ్య, లారీ డ్రైవర్ తో మాస్ కి పూనకాలు తెప్పించి సమరసింహారెడ్డితో ట్రెండ్ సెట్టర్ మారి గాడ్ ఆఫ్ మాస్ గా మారారు. అప్పటి నుంచి బాలయ్యలోని మాస్ హీరో ఆడియెన్స్‌ను అలరిస్తునే ఉన్నాడు. దర్శకులు బాలయ్య కోసం రాసుకున్న మాస్ కథలు ఎన్నెన్నో. అయితే కొందరు హీరోలకు మాస్ అంటే ఒక లిమిట్ ఉంటుంది. మాస్ సినిమాలు ఇక చాలు బాబు అనేలా ఉంటుంది. కానీ బాలయ్య విషయంలో అలా కాదు. ఇంతకంటే మాస్ ఏం చూపిస్తారులే అనుకునేలోపే.. మాస్ కా బాప్ లాంటి సినిమా చేయడం బాలయ్య స్టైల్. సింహా, లెజెండ్, అఖండ లాంటి సినిమాల్లో బాలయ్యలోని కొత్త మాస్ హీరోని చూపించాడు బోయపాటి. మరి ఇంతకంటే మాస్ ఇంకేం ఉంటుంది అనుకుంటే.. వీరసింహారెడ్డిలో బాలయ్య చేసిన మాస్ తాండవానికి థియేటర్లు దద్దరిల్లిపోయాయి. ఇక డాకు మహారాజ్ అయితే నెక్స్ట్ లెవల్ ఆఫ్ మాస్ మూవీ అని చెప్పడంలో ఎలాంటి డౌట్స్ అక్కర్లేదు. డేకేడ్ బెస్ట్ ఇంటర్వెల్ బ్యాంగ్ అంటే ఇప్పటికి దాకు మహారాజ్ అనే చెప్పాలి. ఇక బాలయ్య వింటేజ్ మాస్ మొత్తం చూపించారులే అనుకునే టైమ్ లో బాలయ్య మాస్ దాహం మాత్రం ఇప్పట్లో తీరేది కాదని సరికొత్త మాస్ ని పరిచయం చేసాడు దర్శకుడు గోపిచంద్ మలినేని. లేటెస్ట్‌గా వచ్చిన ఎన్బీకె 111 టీజర్ చూస్తే.. ఈ విషయం అర్థమవుతుంది. ఈసారి వింటేజ్ బాలయ్యను కాకుండా.. న్యూ ఏజ్ బాలయ్యను చూపించాడు. ఈ టీజర్ చూస్తే.. స్టైలిష్ లుక్‌తో బాలకృష్ణ మాస్‌ను 'జెన్-జీ' ట్రెండ్‌కు తగ్గట్టుగా ప్రెజెంట్ చేయబోతున్నాడు గోపీచంద్. దానికి తోడు.. బాలయ్య అంటే ఊగిపోయే తమన్, మరోసారి తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో పూనకాలు తెప్పించాడు. ఏదేమైనా.. గాడ్ ఆఫ్ మాసెస్ అంటే ఆ మాత్రం ఉంటది మరి!

# ఓటీటీలో తొలి అడుగు?

ఓ వైపు మాతృత్వాన్ని ఆస్వాదిస్తూనే.. సినిమాల విషయంలో జోరు చూపిస్తున్నారు పలువురు బాలీవుడ్ నాయికలు. ఇప్పుడీ కోవలోకే రాబోతుంది కథానాయిక కత్రినా కైఫ్. గతేడాది బాబుకు జన్మనిచ్చిన ఈ తార.. కొంత కాలంగా సినిమాల నుంచి విరామం తీసుకొని తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తుంది. ఇప్పుడు మళ్లీ కెమెరా ముందుకు రావడానికి సన్నద్ధమవుతోన్నట్లు తెలుస్తోంది. ఇటీవలే కత్రినా స్క్రిప్టులు చదవడం ప్రారంభించిందని, వచ్చే ఏడాది ద్వితీయార్ధం నాటికి ఓ సరికొత్త కథతో సెట్‌కు తిరిగి రావాలని ఆమె నిర్ణయించుకుందని, ప్రస్తుతం సరైన స్క్రిప్ట్ కోసం పలువురు దర్శకులతో చర్చలు చేస్తుందని సమాచారం. ఓటీటీలో అడుగుపెట్టడానికి కత్రినా చాలా ఉత్సాహంగా ఉందని, త్వరలో ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కత్రినా చివరి సారిగా 2024లో విజయ్ సేతుపతితో కలిసి 'మేరీ క్రిస్మస్'తో తెరపై మెరిసింది.



# పక్షి కథలో జాన్వీ మెరిసేనా!

చికిరి.. చికిరి.. అంటూ 'పెద్ది' సినిమాతో థియేటర్లలో కుర్రకారుని అలరిస్తోంది అందాల తార జాన్వీ కపూర్. ఇప్పుడీ సినిమా జోష్‌లోనే ఆమె మరో కొత్త ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. 'తుంబాడ్' ఫేమ్ రాహి అనిల్ బార్వే దర్శకత్వం వహించనున్న ఓ హారర్ చిత్రంలో జాన్వీ నటించనున్నట్లు సమాచారం. "జాన్వీ.. తన తదుపరి చిత్రం కోసం స్క్రిప్టులు చదువుతూ.. సాధ్యమయ్యే ప్రాజెక్టుల గురించి చర్చిస్తోంది. ఇందులో భాగంగానే అనిల్ బార్వే తెరకెక్కించనున్న ఓ క్రీచర్ హారర్‌కు పచ్చజెండా ఊపింది. ఇప్పటికే ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు మొదలయ్యాయి. ఈ ఏడాది చివర్లో షూటింగ్ ప్రారంభించాలని నిర్మాణ సంస్థ జియో స్టూడియోస్ సన్నాహాలు చేస్తుంద"ని జాన్వీ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరోవైపు తాజాగా దర్శకుడు అనిల్ బార్వే తన రాబోయే ప్రాజెక్టులను అధికారికంగా ప్రకటించారు. అందులో ఒకటి 'పహాడ్‌పంగిరా'. ధైర్యవంతురాలైన ఓ మహిళ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని, దీన్ని వచ్చే ఏడాది విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. దీంతో పాటు పురాణాల్లోని ప్రసిద్ధ 'కాకభుషుండి' అనే పక్షికి సంబంధించిన చీకటి గాథ ఆధారంగా కూడా 'పక్షితీర్థ' అనే సినిమాను రూపొందిస్తున్నారు. ఇది 2030లో థియేటర్లలోకి వస్తుందని వెల్లడించారు. మరి ఈ రెండింటిలో జాన్వీ ఏ కథలో మెరవనుందో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

